క్లుప్తంగా

పేరెంట్స్ సమావేశానికి గ్రీటింగ్ కార్డులు



తవణంపల్లె హైస్కూల్లో పంపిణీకి సిద్ధంగా గ్రీటింగ్ కార్డులు

తవణంపల్లె: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 7వ తేదీన తల్లిదండ్రుల– ఉపాధ్యాయుల సమావేశం నిర్వహిస్తామని తవణంపల్లె ఎంఈఓలు హేమలత, త్యాగరాజురెడ్డి తెలిపారు. మంగళవారం తవణంపల్లె ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్‌కు గ్రీటింగ్‌కార్డులు సిద్ధం చేశారు. తల్లిదండ్రులను ఆహ్వానిస్తూ గ్రీటింగ్ కార్డులను తయారు చేసి విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

యాదమరి పీఆర్టీయూ కార్యవర్గం

కాణిపాకం: యాదమరి ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గ సమావేశం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి ఆధ్వర్యంలో ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శివప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కె.మోహన్ కుమార్, గౌరవాధ్యక్షుడిగా సురేష్ రెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా ఆనంద పిళ్లై, హరికృష్ణ, వైస్ ప్రెసిడెంట్‌గా విశ్వనాథ్, మండల మహిళా ఉపాధ్యాయురాలు కాంచన ,కార్యదర్శులుగా లతా రమణి, సరసలను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా భాస్కరరెడ్డి వ్యవహరించారు.

గర్భిణులు పౌష్టికాహారం తప్పనిసరి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మంగళవారం మండలంలోని గుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ప్రవీణ్



చిత్తూరు కలెక్టరేట్: ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ప్రవీణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు నవంబర్ 27వ తేదీ నుంచి 30 వరకు విజయనగరం జిల్లాలో ఆ సంఘం 49వ రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. అక్కడ నిర్వహించిన ఎన్నికల్లో ప్రవీణ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో 2020 సంవత్సరం నుంచి ఏఐఎస్‌ఎఫ్ సంఘంలో పనిచేస్తూ విద్యార్థుల సమస్యల కోసం పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనకు రాష్ట్ర కార్యవర్గంలో అవకాశం కల్పించిన రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లాలోని పలువురు విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

బంగారుపాళెం: ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు క్షేత్ర స్థాయి సందర్శనతో మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గణాంకాధికారి జార్జి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఆశా డే సమావేశాన్ని నిర్వహించారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఆరోగ్యానికి భరోసా కలిగేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌వెంగల్‌రాయన్ మాట్లాడుతూ.. ఆశాలు, ఏఎన్‌ఎంలు గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు రమేష్, లోకేష్, సీహెచ్‌ఓ నాగమణి, హెల్త్ సూపర్ వైజర్లు హరికృష్ణ, అముద, రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: ప్రజలకు ఇంటి వద్దే వైద్యసేవలు అందిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ సంధ్య అన్నారు. మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా గుడిపాలలో వైద్యశిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు రక్త పరీక్షలు చేశారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులతో పాటు మొత్తం 60 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు పైల్స్ ముప్పు!



- అధిక సంఖ్యలో వ్యాధి బారిన పడుతున్న వైనం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆధునిక జీవనశైలితో కొన్ని వ్యాధులు యువతను వేధిస్తున్నాయి. అందులోనూ చిన్న వయస్సులోనే పైల్స్ బారిన పడుతున్నారు. కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతున్నారు. మొలలు లేదా పైల్స్ అనేవి సాధారణంగా 50 ఏళ్ల వయస్సు వారిలో సగం మందిలో ఎక్కువ చూస్తుంటాం. కానీ నేటి యువత ఎక్కువ మంది పైల్స్ బారిన పడటం వైద్యులకు ఆందోళన కలిగిస్తోంది.

మొలలు అనేవి సాధారణంగా పురుషులు, మహిళల్లోను వస్తుంటుంది. మొలలు ఉన్నవారికి తరచుగా ఇబ్బంది కలుగుతూ ఉంటుంది. మాటల్లో వారు తమ బాధను చెప్పుకోలేరు. పైల్స్ ఉన్నవారు ఎక్కువ సేపు కూర్చున్నా, తిరుగుతున్నా చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. హెమోరాయిడ్స్‌గా పిలిచే మొలలపై అవగాహన కల్పించేందుకు వైద్యశాఖ ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

ఓపీలోనే వంద మంది వరకు..

చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి ఓపీ 1200 దాటుతోంది. ఇందులో 400 నుంచి 600 మంది వృద్ధులే ఉంటారు. కీళ్ల , మోకాళ్ల నొప్పులు, జలుబు, దగ్గు వంటి వ్యాధులతో పలు రకాల జబ్బులతో అన్ని విభాగాల వద్ద వరుస కడుతుంటారు. ఈ జబ్బుల్లో పైల్స్ కూడా ఒకటి. ఈ చికిత్స కోసం రోజు 50 నుంచి 90 వరకు ఓపీలుంటాయి. ఇందులో మందులు, మాత్రలు తీసుకునేవాళ్లు ఉన్నారు. కొంత మంది ఆపరేషన్ చేయించుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

కారణాలు ఇవీ...

మల విసర్జన కష్టంగా ఉండడం.. తక్కువగా మల విసర్జన చేస్తుంటే దానిని మలబద్ధకంగా చెబుతారు. ఇలాంటి సమయాల్లో ఎక్కువ ముక్కినప్పుడు అన్నవాహిక చివరి భాగం, మలద్వారానికి పైన పురీష నాళం చివరన వాచిపోయిన రక్తనాళాలను మొలలని పిలుస్తారు. మొలలు మలద్వారం నుం చి బయటకు పొడుచుకొని వచ్చినట్లు అంతర్లీనంగా పురీష నాళంలోనే పెరిగే అవకాశం ఉంది. మొలలు ఏర్పడటానికి ప్రధాన కారణం మలబద్ధకంగా చెప్పవచ్చు. కొందరిలో మలద్వారం దగ్గర ఉండే సిరలు బలహీనంగా ఉండటం వలన మొలలు వస్తాయి. వంశపారం పర్యంగా మొలలు వచ్చే అవకాశం ఉంది. వ్యాయామం చేయకపోవటం, అధిక బరువు , గర్భం దాల్చినప్పుడు, ఆహారపు అలవాట్లు, పీచు పదార్థాలు తక్కువగా ఉండే ఆహారం తినటం ద్వారా పైల్స్ వచ్చే అవకాశం ఉంది. ఒకేచోట ఎక్కువ సేపు కూర్చొని పనిచేయడం, మానసిక ఒత్తిడి, మద్యపానం, నీరు తక్కువగా తాగడం, మాంసాహారం , జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం చేసే వారిలో పైల్స్ అధికంగా వస్తాయి.

లక్షణాలు ఇవీ...

- మలద్వారం చుట్టూ దురదగా ఉండడం
- మల విసర్జన సమయంలో నొప్పి ఉండి వాపు లేదా ఉబ్బుగా ఉండడం
- మల విసర్జన సమయంలో లేదా అనంతరం రక్తస్రావం కావడం

నివారణ చర్యలు

- పీచు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి.
- ద్రవ పదార్థాలు, ప్రత్యేకంగా నీరు ఎక్కువగా తాగాలి.
- పండ్లు, ఆకు కూరలు, కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలి.
- ఎక్కువగా శ్రమ పడి ఒత్తిడి కలిగేలా మల విసర్జన చేయకూడదు.
- కారం, మాసాలాలు, పచ్చళ్లు, వేపుళ్లు, దుంప కూరలకు దూరంగా ఉండాలి.

ముందస్తు జాగ్రత్త తీసుకోవాలి



పైల్స్ బాధితులకు శస్త్రచికిత్సలో అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. స్టాప్లర్, లేజర్, హాల్స్, ల్యాప్రో స్కోపిక్ వంటి ఆధునిక చికిత్సా విధానాల ద్వారా ఎక్కువ నొప్పి, గాయం లేకుండా చేసే శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. అతి తక్కువ కోత, కుట్లతో ఆపరేషన్లు చేస్తున్నారు. పైల్స్ రాకుండా వ్యాధిపై అవగాహన కలిగి ఉండి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు.

–డాక్టర్ అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

అధ్యాపకుల ప్రతిభ అభినందనీయం



అధ్యాపకులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ జీవనజ్యోతి

చిత్తూరు కలెక్టరేట్: క్రీడల్లో తమ కళాశాల అధ్యాపకులు ప్రతిభ చాటడం అభినందనీయమని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి అన్నారు. మంగళవారం కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తమ కళాశాలలో వ్యాయామ అధ్యాపకుడిగా పనిచేస్తున్న లోకేష్, గ్రంథాలయ అధ్యాపకులు శ్రీకాంత్ క్రీడల్లో ప్రతిభ చాటారన్నారు. ఇటీవల ఎస్వీ యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్ కళాశాలల అధ్యాపకుల క్రీడా పోటీల్లో డబుల్స్ బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానంలో విజేతలుగా నిలిచారన్నారు.

తహసీల్దార్ కార్యాలయ ఆకస్మిక తనిఖీ

తవణంపల్లె: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం సాయంత్రం ట్రైనీ కలెక్టర్ హిమవంశీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల వివరాలను తహసీల్దార్ సుధాకర్‌ను అడిగి తెలుసుకొన్నారు. భూసమస్యలపై ఆరా తీశారు. అనంతరం భూ సమస్యల పరిష్కారం కోసం విచ్చేసిన ప్రజలతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

స్మార్ట్ లాక్‌తో చోరీల నియంత్రణ



బంగారుపాళెం : మొగిలిలో స్మార్ట్ లాక్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసు

బంగారుపాళెం: ఇళ్లకు స్మార్ట్ లాక్ ఏర్పాటు చేసుకోవడంతో చోరీలు నియంత్రించేందుకు అవకాశం ఉందని సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం జాతీయ రహదారి పక్కన గల సింగిల్ హౌస్‌లు, ఆలయాలకు స్మార్ట్ లాక్‌లు పంపిణీ చేశారు. స్మార్ట్ లాక్ పనితీరు గురించి డెమో ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఊర్లకు వెళ్లే ముందు ఇళ్లకు తాళాలు వేసుకుని వెళ్తుంటారన్నారు. దొంగలు సింగిల్ హౌస్‌లను ఎక్కువగా టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతుంటారని తెలిపారు. స్మార్ట్ లాక్ వేసుకోవడం ద్వారా చోరీకి వచ్చిన దొంగలు తాళాలను పగలగొట్టేందుకు ప్రయత్నిస్తారన్నారు. ఈ నేపథ్యంలో స్మార్ లాక్‌ను తాకగానే పెద్ద శబ్దంతో సైరన్ మోగుతుందన్నారు. ఆ శబ్దానికి చుట్టు పక్కల నివాస గృహాల వారు లేచి బయటకు రావడంతో దొంగలు పారిపోతారని అన్నారు. దుకాణదారులు, షాపింగ్ మాల్స్ నిర్వాహకులు స్మార్ట్ లాక్‌లను ఉపయోగించుకోవాలని సూచించారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ వేదిక

ఐరాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బహిరంగ వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ధనలక్ష్మి తెలిపారు. మండలంలోని 28 పంచాయతీలలో 2023 నుంచి 2024 వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు ద్వారా జరిగిన పనులపై బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ వేతనదారులు తప్పక హాజరు కావాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కె.పట్నంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మంగళవారం మండలంలోని చెర్లోపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌వేలు మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల వల్ల ప్రజలు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. జ్వరాలు సోకిన వారు వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్యం చేయించుకోవాలని తెలిపారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమ్మణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.పట్నంలో 37 మందికి వైద్య పరీక్షలు: మండలంలోని కె.పట్నంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ 37 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. ఆసుపత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమమని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శేషజీవితం ప్రశాంతంగా గడపాలి



వెంకటరమణను సన్మానిస్తున్న అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు

చిత్తూరు అర్బన్: శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. చిత్తూరు నగరంలోని పోలీసుల అతిథిగృహంలో మంగళవారం పదవీ విరమణ పొందిన వెంకటరమణను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలం క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారన్నారు. అనంతరం వెంకటరమణకు జ్ఞాపిక, బహుమతిని ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ భాస్కర్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఉధృతంగా గార్గేయ నది



రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

ఐరాల: ఫెంగల్ తుపాను ప్రభావంతో గార్గేయ నది రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఐరాల, చిత్తూరు మార్గంలోని గార్గేయ నది వద్ద రెవెన్యూ, పోలీసు అధికారులు ఉదయం బారికేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు.మధ్యాహ్నం వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో బారికేడ్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. మూడు రోజులుగా మండల వ్యాప్తంగా ముసురు వర్షం కురిసింది. సోమవారం రాత్రి భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని అతిపెద్దదైన బీరప్ప చెరువు నిండు కుండను తలపిస్తోంది. మూడు రోజులుగా మండలంలో 120.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఓ వరలక్ష్మి తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు బహుమతులు

కాణిపాకం: దివ్యాంగుల కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.ఎస్.నాగరాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో మంగళవారం మండల విద్యాశాఖ అధికారులు వాసుదేవన్, మధుసూధన్ రెడ్డి అధ్యక్షతన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ..వికలాంగుల్లో ఆత్మస్థైర్యం నింపడం, ప్రోత్సహించడం కోసం ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల కోసం అందజేస్తున్న ప్రయోజనాలను వివరించారు. తల్లి దండ్రులు మార్పు గుర్తించి విద్యార్థులను భవిత కేంద్రాలకు పంపాలని సూచించారు.

కాణిపాకంలో..

కాణిపాకం: యాదమరి మండలంలోని భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎంపీడీఓ వేణు, ఎంఈఓ రుక్మిణి మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు భవిత కేంద్రం అనేక సేవలను అందిస్తోందన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు రజాక్, ఉపాధ్యాయులు లక్ష్మీపతి, మధు, విష్ణు ప్రియ, ఉమ, మహేష్ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న అధికారులు

పట్టణ ఆరోగ్య కేంద్రం తనిఖీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం మాపాక్షిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం సేవలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. గర్భిణుల సేవల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సుఖ ప్రసవాలను ప్రోత్సాహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ శిరీష, సిబ్బంది మూర్తి పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



నాగరాజు

చిత్తూరు కార్పొరేషన్: ఫెంగల్ తుపాను కారణంగా జిల్లాలో నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫెంగల్ తుపాను కారణంగా నాలుగు రోజులుగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయన్నారు. అధిక వర్షాలకు రైతులు సాగు చేసిన వరి, టమాట, బంగాళాదుంప, వంగ, కాకరకాయ పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు నష్టపోయినట్లు తెలిపారు. పంట నష్టపోయిన రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. వర్షాల ప్రభావంతో గుడిసెలు, మట్టి గోడలు కూలిపోయి ఇబ్బందులకు లోనవుతున్నట్లు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 24 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 24 మందికి రూ.2.40 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు గత రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 24 మందిపై కేసు నమోదుచేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు.

నీటి నిల్వలు లేకుండా చర్యలు



నగరంలో పర్యటిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా నగరంలో నీరు నిల్వ చేరకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆయన నగరంలో పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి పారిశుధ్య పనుల నిర్వహణ, వర్ష పరిస్థితులపై తనిఖీలు నిర్వహించారు. ఎంఎస్ఆర్ సర్కిల్ వద్ద కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో తొలగించాలని పారిశుధ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన కుమార్ నగర్ కాలనీ, గిరింపేట, ఆనంద థియేటర్, హైరోడ్ ప్రాంతాల్లో మురుగునీటి కాలువలను పరిశీలించారు. కాలువల్లో వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకాల లేకుండా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు నగరంలో వర్షపు నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు కాలువలను శుభ్రం చేయించారు. కూలిన చెట్లను వేగంగా తొలగించారు. పారిశుధ్య పనులు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



పేకాటరాయుళ్ల అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళెం: మండలంలోని కేజీ సత్రం సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని మంగళవారం రాత్రి అరెస్టు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. గ్రామానికి సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందంతో సీఐ, తన సిబ్బందితో కలసి స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న తవణంపల్లె మండలం గాజులపల్లెకు చెందిన హమీద్‌బాషా, ఉత్తరబ్రాహ్మణ పల్లెకు చెందిన పృథ్వీరాజ్, బంగారుపాళెం మండలంలోని చిల్లగుండ్లపల్లెకు చెందిన గోవిందం, మణి, పూతలపట్టు మండలం వావిల్‌తోటకు చెందిన వినాయకంను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ 27,900 నగదు స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలి



బంగారుపాళెం: బహుమతులు అందజేస్తున్న అధికారులు

బంగారుపాళెం: విభిన్న ప్రతిభావంతులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఏఎస్ఓ నరోత్తమ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం స్థానిక భవిత భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని, సమాజంలో చిన్న చూపు చూడరాదన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. సీఎంఓ ఉదయలక్ష్మి మాట్లాడుతూ.. దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి తెలియజేశారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాలు వరమన్నారు. ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు మాట్లాడుతూ.. భవిత కేంద్రంలో విద్యాభ్యాసం చేసిన పిల్లలు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హిమబింధు, మీరయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అయ్యో! ఎంత కష్టం వచ్చిందే తల్లీ..

తమ సంతానం అభ్యున్నతికి రెక్కలు ముక్కలు చేసుకుని జీవన చరమాంకానికి చేరుకున్న తల్లిదండ్రులను కన్నబిడ్డలే నిర్దయగా వదిలించుకుంటున్న సందర్భాలు అడపాదడపా చూస్తున్నాం. ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న పలమనేరుకు చెందిన మాతృమూర్తి కూడా అలాంటి అనుభవాన్ని తన సంతానం నుంచి చవిచూసింది. అయితే అనుకోని మలుపులు తిరిగి 'అమ్మ ఒడి' చొరవతో మళ్లీ కుటుంబ సభ్యుల దరికి చేరింది!



వృద్ధురాలికి అండగా నిలిచిన సామాజిక సేవకులు

పలమనేరు: 'సాక్షి' సేకరించిన వివరాల మేరకు.. ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న పండుటాకు పేరు రత్నమ్మ. ఇప్పుడామె వయసు 82 ఏళ్లు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే జన్మించింది. ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. మనవలూ, మనవరాళ్లు.. ఆ తర్వాత తరాలనూ ఆమె చూసింది. జీవితంలో పండిపోయింది. వృద్ధాప్యం తెచ్చిన అనారోగ్య సమస్యలు ఆమెను ఆస్పత్రి పాల్జేశాయి. గత నెల 21న ఆమెను బంధువులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. వైద్యులు, నర్సుల సేవలతో కోలుకున్న అనంతరం ఆమెను ఎనిమిది రోజుల క్రితం డిశ్చార్చి చేసినా కుటుంబ సభ్యుల జాడే లేదు. ఎవరూ ఆమెను తీసుకెళ్లలేదు. దీంతో ఆమెకు ఆస్పత్రిలోని రోగులు, వారి సహాయకులు పెట్టే ఆహారంతో రోజులు నెట్టుకొచ్చింది. ఈ నేపథ్యంలో చిత్తూరు పట్టణానికి చెందిన ప్రమీల, మోహన్ ఆమె సమస్యను తెలుసుకుని 'అమ్మ ఒడి' ఆశ్రమ నిర్వాహకుడు పద్మనాభనాయుడుకు సమాచారం ఇచ్చారు. మంగళవారం ఆయన రత్నమ్మ దరికి చేరుకుని ఆమె పూర్తి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేసినప్పుడు ఆమె తన కుమార్తెలు, కుమారుల గురించి తెలియజేసింది. తన కుమారుల్లో ఒకడు ఆస్పత్రిలో చేర్చి వెళ్లిపోయినట్లు తెలిపింది. అయితే అతడు అడ్మిట్ చేసేటప్పుడు తన సెల్ నంబర్ కాకుండా తన సోదరీమణుల్లో ఒకరి నంబర్ ఇచ్చినట్లు తేలింది. ఆ నంబర్‌కు పద్మనాభనాయుడు కాల్ చేస్తే ఎట్టకేలకు లిఫ్ట్ చేసి మాట్లాడారు. ఇక ఆపై, సీన్ కట్ చేస్తే..

చిత్తూరు టు పలమనేరు

కుటుంబ సభ్యుల నిరాదరణకు గురైందని నిర్ధారించుకున్న పద్మనాభనాయుడు రత్నమ్మను మంగళవారం మధ్యాహ్నం చిత్తూరు నుంచి ఒక కారులో పలమనేరుకు తీసుకువచ్చారు. ఎట్టకేలకు ఫోన్ నంబర్ తాలూకు రత్నమ్మ కుమార్తె వద్దకు వచ్చారు. కౌన్సెలింగ్ ఇచ్చి వారికి రత్నమ్మను అప్పగించారు. కన్నతల్లిని చూసుకోవడం బిడ్డల బాధ్యత అని హితవు పలికారు. మాతృమూర్తిని వదిలించుకోవాలని చూసిన ఆ కన్నకొడుక్కి కూడా తన జీవిత చరమాంకంలో తన పిల్లల నుంచి ఇలాంటి పరిస్థితే ఎదురైతే..!? అనే ప్రశ్న ఉదయించింది.